నా సగప్రాణమైన సుధా

**గడిచినది ఒక వత్సరం మీరు లేక**

**గడవలేదు ఒక్క నిముషమైనా మిమ్మల్ని తలవక**



నిన్న మొన్నటిదాకా నా వెంట ఉండి నన్ను నడిపించిన నా సగప్రాణమా

నన్నిలా ఒంటరిగా వదిలి వెళ్లుట మీకు న్యాయమా?

గతంలో మీ ఎడబాటు కొన్ని వారాలైనా

ఇప్పటి ఈ ఎడబాటుకి అంతం లేకపోయినా

నా అంతరంగాన మీ జ్ఞాపకాలు మటుకు అనంతం

ఒకే ప్రాణం, రెండు శరీరాలు అప్పుడు

శరీరం ఒక్కటే, కానీ ప్రాణాలు రెండు - అది ఇప్పుడు

రమ లేనిచోట సుధకి పనిలేదు అని నమ్మి నన్ను అనుసరించిన ఆ తీయని బంధం

ఎన్ని జన్మలకు ఏమి ఇచ్చి తీర్చుకోగలను ఆ తరగని ఋణం?

"మిమ్మల్ని చూడకుండా ఉండలేమండి" అని ఎన్నోసార్లు అన్న నేను

ఎటు చూసిన మీ చిత్రాలు ఉండేటట్లు చూసుకొని సంతృప్తి పడుతున్నాను

ప్రతి ఉదయం "శుభోదయం" అంటూ మీరు పంపిన వేల జాబులు

మీరు ఇంకా నాతోనే ఉన్నారు అన్న నమ్మకాన్ని నాలో కల్గిస్తున్న వేవేల వరాలు

ఆ జాబులలోని వివరాలు చదివిన ప్రతీసారి వెలుగును నా పెదవులపై చిరునగవులు

కురియును నా మనసులో ఆనందపు చిరు జల్లులు

ఏ జన్మలోనో చేసుకున్న పుణ్యం

ఈ సుధామధుర స్నేహ బంధం

చిరకాలం నా మదిలో చిరస్మరణీయం

ఓ మరలి రాలేని నా ప్రియ నేస్తం

మరు జన్మలోనైనా విడవవుగా నా హస్తం?

ఆశ్రువులతో

మీ ప్రాణ స్నేహితురాలు

రమ